క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి కృషి



భూమిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

రాయికల్ : పట్టణాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 6వ వార్డులో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డుకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో సీసీరోడ్లు, మురుగుకాలువలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్వరిబేగం, మహేందర్, మహేశ్ గౌడ్, మైనార్టీ నాయకులు హుస్సేన్ , తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాధనం దుర్వినియోగం'

జగిత్యాలటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలపై భారం మోపుతుందని బల్దియా ఫ్లోర్‌లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో జగిత్యాల బల్దియా సాధారణ నిధుల నుంచి రూ.15లక్షలు ఆమోదం పొంది అధికారులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు.బల్దియాలోని శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూతో సహా అన్ని విభాగాల్లో అవినీతి పెరిగిందన్నారు. ప్రజా సమస్యలు మరిచి దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని ఖర్చు చేయడమేంటన్నారు. జిల్లాల పర్యటనల్లో ప్రతి గ్రామానికి రూ.పది లక్షలు ప్రకటిస్తున్న సీఎం కేసీఆర్ జగిత్యాల బల్దియాకు మొండిచెయ్యి చూపారన్నారు.

బెంచీల వితరణ



బెంచీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయికల్: పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద లయన్స్ క్లబ్ సభ్యుల చొరవతో గురువారం పది బెంచీలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో డీసీ బత్తిని భూమయ్య, మ్యాకల రమేశ్, చౌడారపు లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ఎద్దండి దివాకర్, కొమ్ముల ఆదిరెడ్డి, కడకుంట్ల నరేశ్ పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

రాయికల్: రైతుల సహకారంతోనే లోడి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని లోడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అయోధ్య గ్రామంలో లోడి సంస్థ ఆధ్వర్యంలో మండలస్థాయి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామస్తుల సహకారంతో సంస్థ చెరువుకట్టల మరమ్మతులు, నిరుపేదలను ఆదుకునేందుకు కూరగాయల గింజలు, కోడిపిల్లల పంపిణీ, రైతుల సంక్షేమం కోసం చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు నాగేశ్వర్, ఆర్ల రెడ్డి, సర్పంచులు రాగి సాగరిక, ఎడ్మల జీవన్‌రెడ్డి, లోడి సంస్థ మండల కన్వీనర్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

ఇబ్రహీంపట్నం: మిషన్ భగీరథ నీటిని వినియోగించుకోవడంలో ఇబ్రహీంపట్నం మండలం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. గురువారం మండలంలోని డబ్బా వాటర్ గ్రిడ్ వద్ద సర్పంచ్ నేమూరి లత సత్యనారాయణను భగీరథ ఈఈ శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ ఆనంద్ సన్మానించారు. అనంతరం ప్రశంసాపత్రం అందజేశారు.

పేకాట స్థావరంపై దాడి

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామశివారులోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పక్కా సమాచారం తెలుసుకొని అక్కడిక వెళ్లగా 11 మంది పేకాట ఆడుతూ కనిపించారు. వారిలో ఆరుగురు పారిపోగా ఐదుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.11,400 స్వాధీనం చేసుకున్నారు. స్థావరం వద్ద ఏడు బైక్‌లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

మల్యాల: అమరవీరుల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, రాష్ట్ర సాధనలో సకల జనులు ఉద్యమించారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మిట్టపల్లి విమల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. అమరుల త్యాగాలను స్మరిస్తూ హైదరాబాద్‌లో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చారన్నారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో చర్చలు లేకుండానే ముగించాలని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మిట్టపల్లి విమల, జెడ్పీటీసీ కొండపలకల రామ్మోహన్‌రావు, వైఎస్ ఎంపీపీ పోతాని రవి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సుదర్శన్, ఎంపీడీవో వెంకటేశం, ఎంపీటీసీలు, వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలి

మల్లాపూర్ : పల్లెప్రగతి స్ఫూర్తితో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ఎంపీపీ కాటిపెల్లి సరోజన పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కృషితో నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. కొందరు ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకాకపోగా వచ్చిన వారు మధ్యలోనే వెళ్లిపోవడంతో సాదాసీదాగా ముగిసింది. అంతకుముందు అమరులకు నివాళి అర్పించారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నాగేశ్, కో–ఆప్షన్ సభ్యుడు ఎంఏ.సత్తార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అమరుల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, ప్రజాప్రతినిధులు

మండల సభకు ప్రజాప్రతినిధులు డుమ్మా

జగిత్యాలరూరల్: జగిత్యాల మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని గత సర్వసభ్య సమావేశంలోనే ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించారు. గురువారం అధికారులు ఏర్పాటు చేసిన సమావేశానికి రూరల్ మండలంలోని 20 మంది ఎంపీటీసీలు, 29 మంది సర్పంచులు గైర్హాజరయ్యారు. దీంతో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలాన్ని ఆదర్శంగా నిలపాలి

ఇబ్రహీంపట్నం : మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి అధ్యక్షతన సమావేశం జరిగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెరువుల పండుగ ఉత్సవాల్లో గోధూర్‌లో జీపీ సిబ్బందిపై తిట్టారని సర్పంచ్ సోమ ప్రభాకర్ ఎంపీడీవో ప్రభును నిలదీయగా పనులు సక్రమంగా నిర్వహించకపోతే కిందిస్థాయి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశామని సమాధానమిచ్చారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని తెలుపగా మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేశామని, మన ఊరి–మన బడి కింద పనులు జరుగుతున్నందున పూర్తికాగానే పనులు చేయిస్తామని భీమేశ్వరి ఎంపీపీ తెలిపారు. రూ.65వేలతో క్రీడాప్రాంగణం పనులు పూర్తి చేస్తే రూ.35వేల బిల్లు ఇస్తారా అని సర్పంచ్ సభ దృష్టికి తీసుకెళ్లగా మిగతా డబ్బులు అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు. కొమటికొండాపూర్‌లో క్రీడా ప్రాంగణం నిర్మిస్తే బిల్లు ఇవ్వలేదని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. యామపూర్ పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు ఎప్పుడు వస్తారో తెలియదని విద్యా దినోత్సవం సందర్భంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తే సమాచారం అందించలేదని ఎంపీటీసీ బొరిగం వివేకవర్ధిని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడికి మెమో జారీ చేయాలని ఎంపీడీవో ఆదేశించారు. ఎంపీపీ భీమేశ్వరి మాట్లాడుతూ.. మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు సహకరించాలన్నారు. అంతకు ముందు అమరువీరులకు నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఏవో దీపిక, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ భీమేశ్వరి

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కథలాపూర్: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని, నిర్లక్ష్యం చేయొద్దని పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జవ్వాజి రేవతి అధ్యక్షతన జరిగింది. దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని పెగ్గెర్ల సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, అంబారిపేట సర్పంచ్ గోపు శ్రీనివాస్ సభలో ప్రస్తావించారు. ప్రభుత్వం అనుమతితో దరఖాస్తు చేసుకున్నవారికి కొత్త రేషన్‌కార్డులు మంజూరవుతాయని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. భూషణరావుపేట శివారులో రాళ్లవాగు ప్రాజెక్టు కాలువల పరిస్థితి అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ కొండ ఆంజనేయులు సభ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేపడుతామని ఏఈ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. రైతు వేదికల్లో మద్యం తాగి సీసాలు పగులగొడుతున్నారని ఏవో యోగితా తెలిపారు. పోతారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ జలంధర్ సభ దృష్టికి తీసుకెళ్లగా అన్ని గ్రామాలకు బస్సుసౌకర్యం కల్పించాలని ఎంపీపీ రేవతి ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, ఎంపీడీవో జనార్దన్ వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీలు బాలు, ఆంజనేయులు, హైమావతి, గంగరాజం, సింగిల్ విండో చైర్మన్ దేవరాజం, సర్పంచ్ సులోచన, లక్ష్మీనర్సయ్య, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేవతి

ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని పలువురు ప్రజాప్రతినిధులు మండలసభలో కోరారు. మేడిపెల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన జరిగింది. ముందుగా అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పలువురు సర్పంచులు మాట్లాడారు. గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలకు, డంపింగ్‌యార్డులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరగా నిబంధనల ప్రకారం డీడీలు చెల్లించాల్సిందేనని ఏఈ విశ్వతేజ పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఏవో త్రివేదిక, ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ ఖయ్యూం, ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



నాచుపల్లి జేఎన్‌టీయూలో అమరుల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు



మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఆర్డీఓ, తదితరులు



సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు నివాళి అర్పిస్తున్న నాయకులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు, అధికారులు



సాతారంలో నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మౌనం పాటిస్తున్న మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్



పెగడపల్లి మండల పరిషత్‌లో కార్యాలయంలో..



నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

జగిత్యాల/జగిత్యాల రూరల్/ కోరుట్ల/ ధర్మపురి/మల్లాపూర్/వెల్గటూర్/ కొండగట్టు/ మెట్‌పల్లి/ . బుగ్గారం/ఇబ్రహీంపట్నం, పెగడపల్లి/ రాయికల్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో అమరుల స్తూపం, చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచుల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించి అమరవీరులకు నివాళి అర్పించారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి



నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

- హామీలను మరిచిన ఎంపీ, ఎమ్మెల్యేకు గుణపాఠం తప్పదు
- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి

మల్లాపూర్: ఉమ్మడి జిల్లాలోని ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని చెరుకు రైతుల కోసం తెరిపించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో పెద్దమ్మ ఆలయం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, చెరుకు రైతులతో కలిసి నిజాం షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. జిల్లాలోని ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ 35 ఏళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో మూతపడిందన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని రైతులంతా 8 సీజన్లలో పండించిన చెరుకుపంటను కామారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ ఎంపీ అరవింద్ వాగ్దానాలను విస్మరించారన్నారు. రైతు సంక్షేమంటూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకు రైతుల గోడును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి షుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వ పరంగానైనా, ప్రైవేటు పరంగానైనా తెరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు షుగర్ ఫ్యాక్టరీ ఎదుట సీఎం కేసీఆర్, ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు అందె మారుతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గ్రామాధ్యక్షుడు చింతలపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'నవోదయ'లో సీటు

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన నీలి అగస్త్య నవోదయలో సీటు సాధించింది. ఆరో తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్షరాయగా గురువారం విడుదలైన ఫలితాల్లో అర్హత సాధించింది. ఈ సందర్భంగా అగస్త్యను ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోరుట్ల రూరల్: మండలంలోని ధర్మారం ప్రభుత్వ ప్రాథమికోత్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి గురువారం తెలిపారు. బుధవారం రాత్రి విడుదల చేసిన ఫలితాల్లో శ్రీనిథ్ రెడ్డి, హృతిక్ రెడ్డి, సహస్ర అనే విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించారని పేర్కొన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.



శ్రీనిథ్ రెడ్డి



హృతిక్ రెడ్డి



సహస్ర

కేంద్ర పథకాలపై ఇంటింటా ప్రచారం

పెగడపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గురువారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలతో ముద్రించిన కర పత్రాలను పంపిణీ చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, రాష్ట్ర మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు మోహన్‌రెడ్డి, కిశోర్, రామ్, బాబు, రమేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో

జగిత్యాలరూరల్: దేశ ప్రజల సంక్షేమానికి ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని జగిత్యాల బీజేపీ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నలువాల గంగారాం, కమలాకర్, పవన్, శ్రీధర్, బాపురెడ్డి, అజయ్, తిరుపతి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యం

మెట్‌పల్లి: బీజేపీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యమవుతోందని పార్టీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ పేర్కొన్నారు. గోల్ హన్మాన్ వాడకట్టులో గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, సుంకెట విజయ్, రమేశ్, లోలపు అనిల్, కుడుకల రఘు, బొడ్ల గౌతం, కిషన్‌మూర్తి తదితరులున్నారు.



నర్సింగాపూర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సంక్షేమ పథకాలు వివరించాలి

మల్లాపూర్ : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ముత్యంపేట నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండ స్వామి, శివరాత్రి అంజమ్మ, సారుగు దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ధర్మపురి : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని బీజేపీ పట్టణ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం పిలుపునిచ్చాడు. ధర్మపురిలోని కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పట్టణంలోని 41వ బూత్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాంగా సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, బండారు లక్ష్మణ్, ప్రణీత్, నాయకులు వెంకటేశ్, శివ, ఆకుల మహేశ్ తదితరులున్నారు.

- అదనపు తరగతి గదులు ప్రారంభం

మెట్‌పల్లి: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన రెండు తరగతి అదనపు తరగతి గదులను గురువారం ఎంపీపీ మారు సాయిరెడ్డి ప్రారంభించారు. 15 ఆర్థిక సంఘం నిధులు రూ.13లక్షలతో గదులను నిర్మించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల : రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899